క్లుప్తంగా...

కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా వారి వస్త్ర మేళా



మణికొండ: వేసవికాలం సందర్భంగా కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా వారు సిల్క్ అండ్ కాటన్ వస్త్ర మేళాను మణికొండ ఓపెన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ మేళా వారం రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ వస్త్ర మేళాలో దేశంలోని అన్ని రకాల చేనేత కళాకారులతో నేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు లభిస్తున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలం సందర్భంగా చేనేత వస్త్రాలు ధరించి వేసవి తాపాన్ని నుంచి రక్షణ పొందగలరని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు వినోద్ తెలిపారు.

హుడా కాలనీ మాజీ కార్యదర్శి మృతి



యూసుఫుద్దీన్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని హుడా కాలనీకి ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా సుదీర్ఘ కాలం పనిచేసి ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన మహ్మద్ యూసుఫుద్దీన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాలనీ కార్యవర్గ సభ్యులతో పాటు ప్రజలు కోరుకున్నారు. ఆయన ఏయిర్‌ఫోర్స్‌లో పనిచేసి రిటైర్ అయిన తరువాత మణికొండలో స్థిరపడి స్థానిక సమస్యలపై అవిశ్రాంతంగా కృషి చేశారని వారు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం



సునీత

రాజేంద్రనగర్: మహిళ అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మిగూడకు చెందిన మహేష్, సునీత(35) భార్యాభర్తలు. ఏప్రిల్ 13న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సునీతకు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం

గోల్కొండ: ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. అమర్ సింగ్ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్-ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని బీజేపీకి ఓటు వేయాల్సిన అవసరాన్ని గురించి ప్రజలకు వివరించారు. ప్రధానిగా నరేంద్రమోదీ వచ్చిన తరువాత దేశ ప్రతిష్టత బాగా పెరిగిందని తమ దేశం అగ్రదేశాల సరసన నిలిచిందని ఆయన అన్నారు. తెలంగాణలో యువతకు భవిష్యత్తు లేకుండా పోయిందని, దీనికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థతదే కారణమని ఆయన ఆరోపించారు.

షేక్‌పేట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బల్దియా కమిషనర్ లోకేష్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధి పనులు, తాను పంపిన ప్రతిపాదనల విషయంపై బల్దియా కమిషనర్‌తో చర్చించారు. షేక్‌పేట్ డివిజన్ నగరంలో ఎంతో ప్రాధాన్యత గల డివిజన్ అని, డివిజన్ పరిధిలో కమర్షియల్ కాంప్లెక్స్‌లతో పాటు ఎన్నో నివాస భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. మరోవైపు షేక్‌పేట్ డివిజన్ పరిధిలో ఎన్నో పాత బస్తీలు కూడా ఉన్నాయన్నారు. కాగా రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కమిషనర్‌ను కోరారు. షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని ఎన్నో రోడ్లు నేటికీ విస్తరణకు నోచుకేలేదన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని బల్దియా కమిషనర్ హామీ ఇచ్చారు.



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫరాజ్



అడ్డ‘దారి’లోనే..

యూటర్న్ ఉన్నా.. రాంగ్‌రూట్‌లో ప్రయాణం

తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని పోలీసులు

మియాపూర్: జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద వాహనదారులు, పాదచారులు రాంగ్ రూట్‌లో రోడ్డు దాటుతున్నారు. దీని కారణంగా తరచు ప్రమాదాలతో బాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు కూడా రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటుతుండడంతో నేరుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయకుండా ఫొటోలపై దృష్టి సారిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మియాపూర్, చందానగర్ జాతీయ రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువ. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ట్రాఫిక్ పోలీసులు పలు మార్పులు చేశారు. వాహనాలు వేగంగా ముందుకు సాగాలనే ఉద్దేశ్యంతో జాతీయ రహదారిపై యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. మియాపూర్ నుండి బీహెచ్ఇఎల్ కూడలి వరకు పలు చోట్ల యూటర్న్‌లు పెట్టారు. గతంలో కంటే వాహనాల సంఖ్య పెరగడమే కాకుండా వేగంగా వెళ్తున్నాయి. యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. దీనివల్ల యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలు నేరుగా వచ్చే వాహనాలను ఢీకొంటున్నాయి. యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది కనిపించడం లేదు. రాంగ్ రూట్‌లో వచ్చే వారిని నియంత్రించే వారు లేకపోవడంతో యూటర్న్‌ల వద్ద ఎవరికి వారు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు.

- మియాపూర్-చందానగర్ జాతీయ రహదారిపై సంతోష్ దాబా ముందు, మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్ ముందు, దీప్తిశ్రీనగర్, స్వాగత్ హోటల్, అనూ ఫర్నిచర్ ముందు, చందానగర్ గంగారంలోని కేఎల్ఎమ్ సమీపంలో ఉన్న యూటర్న్‌ల వద్ద అధిక సంఖ్యలో వాహనదారులు ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకోకుండా దగ్గరలో ఉన్న యూటర్న్‌ల నుండి రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. రాంగ్‌రూట్‌ల వద్ద రోడ్డు దాటేందుకు వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలతో సంబంధం లేకుండా దాటే ప్రయత్నం చేస్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ దూరి వాహనదారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు సడన్‌గా ఆగిపోవాల్సి వస్తోంది.
- ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు అదే విధంగా దీప్తిశ్రీనగర్ యూటర్న్ వద్ద చెత్త ఆటోలు, చెత్త లారీలు కూడా అధికంగా రాంగ్ రూట్‌లో చందానగర్ వైపు వెళ్తుంటారు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలను ఫొటోలు తీస్తున్నారే తప్పా వెళ్లకుండా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.
- యూటర్న్‌ల వద్ద వాహన చోదకులకు సూచనలు, రాంగ్‌రూట్‌లో వచ్చే వారిని నియంత్రించేందుకు ట్రాఫిక్ సిబ్బందిని నియమించి అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.





మదీనాగూడలో యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చి రోడ్డు దాటుతున్న వాహనదారులు

వట్టినాగులపల్లిని నార్సింగిలోకి మార్చండి



సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పోలీస్ స్టేషన్ల విభజనలో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామం గతంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంచారని, దాన్ని నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలని సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కోరారు. సోమవారం నార్సింగిలోని శ్రీకృష్ణ మూవ్‌మెంట్ హెరిటేజ్ టవర్ శంకుస్థాపనకు వచ్చిన ముఖ్యమంత్రికి ఆయన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మిర్జాగూడ, మియాఖాన్‌గూడ, జన్వాడ తదితర గ్రామాలను ఇటీవల కొత్తగా ఏర్పడిన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చారన్నారు. నార్సింగి పోలీసులపై పని భారం తగ్గటంతో ప్రస్తుతం వట్టినాగులపల్లిని ఇటువైపు మార్చాలని కోరానన్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ రాజేంద్రనగర్ డీసీపీ, నార్సింగి ఏసీపీల పరిధిలోను లేదని లేఖలో పేర్కొన్నానని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్లు జి.శివారెడ్డి, శ్రీకాంత్ రావు, బి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన అవసరం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

శంషాబాద్: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ఆమె అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణాకు గల కారణాలపై ప్రజల్లో చైతన్యం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. ప్రజ్వల సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, సీనియర్ కో ఆర్గినేటర్ ఎం. సురేష్, శ్రావ్య, వినోద్ పాల్గొన్నారు.

సీఐటీయూ మేడే వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం కేంద్రీకరిస్తూ మేడే ఉత్సవ వేదిక కాటేదాన్ చౌరస్తాలో బహిరంగ సభను నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర మాజీ బేరర్ రాజారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతను సంకేతం, కార్మిక వర్గ చైతన్యానికి ప్రతి రూపమన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒకటైన కలానికి నిలువెత్తు సాక్ష్యమన్నారు. కార్మికుల రక్తపుర్పణంతో చరిత్ర లిఖించడబిందన్నారు. రాజేంద్రనగర్ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న అన్ని పరిశ్రమలలో కార్మిక చట్టాలను కల్పించాని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అన్ని అమలు చేయాలన్నారు. 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన కార్మికులకు విద్యార్థులకు, బహుమతులు ఆయన చేతుల మీదుగా అందించారు. కాటేదాన్ చౌరస్తా నుంచి దుర్గానగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, సహాయ కార్యదర్శి రామ్మోహన్‌రావు, గండిపేట్ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్, బాలాపూర్ కన్వీనర్ పెంటయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య, సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులకు ప్రతిభా సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం హైదర్షాకోట్‌లోని షాడోస్ కుంగ్ ఫూ కరాటే గ్రాండ్ మాస్టర పూనపాటి మురళీకృష్ణం రాజు తన వద్ద కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు ప్రతిభా సర్టిఫికెట్లను అందజేశారు. వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 70–100 శాతం మార్కులు సాధించిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చి అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. చదువుపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు మాస్టర్ మురళీకృష్ణంరాజు పడుతున్న తపన అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో షాడోస్ కుంగ్ ఫూ గౌరవ అధ్యక్షుడు కిషోర్, సలహాదారుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, బ్లాక్‌బెల్ట్ విద్యార్థులు శ్రీ వెన్నెలయాదవ్, శ్రీకృష్ణయాదవ్, గణేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో ప్రజలు సహకరించాలని అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. కాంతారెడ్డినగర్ కాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో రోజుల నుంచి అటు అంబియన్స్ ఫోర్ట్ ఇటు కాంతారెడ్డినగర్ కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పనులను ప్రారంభించాలని సూచించామన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతాప్రమాదాలతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి మోండ్ర కొముర‌య్య, సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధు, బిల్డర్ రామ్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, బీట్కారి సిద్ధేశ్వర్, వెంకటేష్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆదిల్ సోహెల్

మణికొండ: హఠాత్తుగా ఎవరికి పడితే వారికి వస్తున్న హార్ట్‌ఎటాక్‌లను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ సీపీఆర్‌లపై అవగాహన కలిగించుకోవాలని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ ఆదిల్ సోహెల్ అన్నారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో కార్డియాక్ ఎటాక్‌పైన కౌన్సిలర్‌లు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా ఎవరైనా అకస్మాత్తుగా గుండె కొట్టుకోవటం ఆగిపోయి కింద పడిన వ్యక్తులను గమనించి వారికి సీపీఆర్ చేస్తే బతికే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, జేఏఓ వీరస్వామి, ఇన్‌చార్జి మేనేజర్ లక్ష్మి, హెచ్ఈఓ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు లక్ష్మీనారాయణ, పద్మారావు, పురుషోత్తం, వందన నగేష్, కోఆప్షన్ సభ్యులు లక్ష్మీరాములు, సిద్దప్ప, తాజుద్దీన్, స్టాఫ్ నర్స్ కరుణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా సాగుతాం

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్
- పీజేఆర్‌నగర్, గుల్షన్‌నగర్, పాన్‌మక్తాలో గడపగడపకూ బీజేపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా సాగుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్ లోని పీజేఆర్ నగర్, గుల్షన్‌నగర్, పాన్‌మక్తాలలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతికాలనీ, బస్తీలో డ్రైనేజీ సమస్య, రోడ్లు తదితర సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిని పరిష్కరించేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రస్తుతం పాదయాత్ర ద్వారా ప్రతికాలనీలో సమస్యలను గుర్తించడం జరుగుతోందని, ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను కూడా పరిష్కరించేలా చేస్తామన్నారు. శేరిలింగంపల్లిలోని అన్ని డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు మన్యంకొండ సాగర్, చెన్నయ్య, చంద్రశేఖర్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రవినాయక్, భరత్ గోపాలకృష్ణరాజు, మఖన్‌సింగ్, బంటి మేరీ పాల్గొన్నారు.

‘మనూ’లో నేడు వర్క్‌షాప్

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ జర్నలిస్టుల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ (ఎంసీజే), యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్‌సహకారంతో ఉర్దూ జర్నలిస్టులకు ‘కౌంటరింగ్ డిస్ఇన్ఫర్మేషన్’ అంశం పేరిట ఉదయం 9.30 గంటలకు సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు.

మానవీయ విలువలు బోధించేదే ఉత్తమ సాహిత్యం



మాట్లాడుతున్న ఆచార్య అనుమాండ్ల భూమయ్య

చార్మినార్: మానవీయ విలువలు బోధించేదే ఉత్తమ సాహిత్యమని ప్రముఖ సాహితీవేత్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం ‘మకర హృదయం’కావ్యం అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవి బలహీనుల పక్షాన నిలబడి వారి మూగ వేదనకు అక్షరూపం ఇవ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణ సోయితో బడుగు జనుల చైతన్య స్ఫూర్తితో సమకాలీన దృక్పథంతో మకర హృదయం కావ్యాన్ని రాశానని భూమయ్య విశ్లేషించారు. శత వసంతాల ఘన చరిత్ర కలిగిన సిటీ కళాశాలలో అద్భుతమైన విద్యాత్మక వాతావరణం ఉందన్నారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు, మూసీ పత్రిక సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ.. గుణ సౌందర్యమే ఉన్నతమైన సౌందర్యమన్నారు. సభ్యకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. పాఠ్యాంశంలోని సమున్నత విలువలను అందిపుచ్చుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

తైక్వాండోలో రాణించిన హైదరాబాద్ క్రీడాకారులు



క్రీడాకారులను అభినందించిన అసోసియేషన్ నాయకులు

మణికొండ: జపాన్ దేశంలో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారులు రాణించారు. మన దేశం తరపున ఐదుగురు క్రీడాకారులు ఇందులో పాల్గొనగా అందులో ఇద్దరు మెడల్‌లను సాధించారు. గ్లెండల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6 గ్రేడ్ చదువుతున్న రాబ్యవర్మ, ఆగా ఖాన్ అకాడమీకి చెందిన రిషాన్ చంద్ర మహంతి సిల్వర్ మెడల్‌లు సాధించనట్లు గ్రాండ్ మాస్టర్, సోమఫిట్ తైక్వాండో అకాడమీ కోచ్ విజయ్‌కుమార్ తెలిపారు. వీరితో పాటు శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో 5వ గ్రేడ్ చదువుతున్న ధృవబొజ్జ, ధృతిబొజ్జా, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 7వ గ్రేడ్ చదువుతున్న హవిష్‌బొజ్జ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్నారని ఆయన వివరించారు. వీరిని సోమవారం జాతీయ ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి మహేశ్వర్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వహాజ్ ఆలీఖాన్, రిఫెరెన్స్ కమిటీ చైర్మన్ నర్సింహాలు వారిని హైదరాబాద్‌లో అభినందించారని కోచ్ తెలిపారు.

బోజగుట్ట బస్తీని అభివృద్ధి చేస్తా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రితో బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్, బోజగుట్ట వాసులు

గోల్కొండ: పేదల బస్తీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో గుడిమల్కాపూర్ డివిజన్ బోజగుట్ట బస్తీని అభివృద్ధి చేస్తానని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బోజగుట్ట సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ ఆధ్వర్యంలో సోమవారం బోజగుట్ట వాసులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. తమ బస్తీలో నేటికి ఇరుకైన రోడ్లపై మురుగు కాలువలా ప్రవహిస్తుందని, మహిళలు, పిల్లలు రోడ్డుపై నడవలేకపోతున్నారని వారు కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. బోజగుట్టలో తాను త్వరలోనే పర్యటించి సమస్యలు తెలుసుకుంటానని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. బోజగుట్టకు అవసరమైన రోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిస్తానని, ప్రతిపాదనలు అందిన వెంటనే నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభింపజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, కార్యదర్శి భుజేందర్, దేవర శ్రీనివాస్, దేవర వంశీ, మహిపాల్‌సాగర్ తదితరులున్నారు.

బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



బహిరంగ సభకు కాటేదాన్ నుంచి పాదయాత్రగా తరలివెళ్తున్న కాంగ్రెస్ నేతలు

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు సానెం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కాటేదాన్ నుంచి భారీ ర్యాలీగా సరూర్‌నగర్‌కు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ జెండాలు పట్టుకొని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు దుర్గానగర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం భారీ కాన్వాయి ద్వారా బహిరంగ సభకు తరలివెళ్లారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్ నగర్ డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున దుర్గానగర్‌కు చేరుకున్న నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ముద్దగొనీ భాస్కర్‌గౌడ్, ధనుంజయ్, పెంద్యాల శ్రీధర్, కోరని బాల్‌రాజ్, మహ్మద్ ఖాలేద్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగి నుంచి..

మణికొండ: సరూర్‌నగర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు ప్రియాంకగాంధీ యువ సంఘర్షణ సభకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, మణికొండ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



కోకాపేట నుంచి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో..



మణికొండ నుంచి చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో..